# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-10-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతికి సంతాపం ప్రకటించింది.
2. విజయవాడ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకదుర్గమ్మ ఈరోజు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు.
3. రాష్ట్రంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు నీతి ఆయోగ్ బృందం ఈరోజు నుంచి రెండ్రోజుల పాటు పలు జిల్లాల్లో పర్యటించనుంది.
4. బియ్యం అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
5. ఈ రోజు జాతీయ తపాలా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

============================

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ రోజు సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం ప్రముఖ పారిశ్రామికవేత్త రతన్ టాటా మృతికి సంతాపం ప్రకటించింది. రతన్ టాటా చిత్రపటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నివాళి అర్పించారు. అనంతరం మంత్రి వర్గ అంశాలపై చర్చను క్యాబినెట్ వాయిదా వేసింది.

ఇది ఇలా ఉండగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ రతన్ టాటా పార్థివ దేహానికి నివాళులర్పించేందుకు ముంబైకి బయలుదేరి వెళ్లారు. కాగా ముంబైలోని ఎన్‌సీపీఏ గ్రౌండ్‌లో రతన్ టాటా పార్థివ దేహాన్ని ప్రజలు, ప్రముఖుల సందర్శనార్థం ఉంచారు. మహారాష్ట్ర ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో ఈరోజు సాయంత్రం రతన్ టాటా అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

---------------------------

విజయవాడ దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన ఈరోజు దుర్గాష్టమిని పురస్కరించుకొని ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. సర్వ శక్తిప్రదాయిని, మహా ప్రకృతి స్వరూపిణి అయిన దుర్గాదేవి దర్శనం సకల శుభాలను కలుగజేస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు. కాగా దసరా మహోత్సవాలలో భాగంగా శ్రీశైలంలో భ్రమరాంబికాదేవి అమ్మవారు ఈ

సాయంత్రం మహా గౌరీ అలంకారంలో దర్శనం ఇవ్వనున్నారు. అలాగే నంది వాహనంపై స్వామి అమ్మవార్ల గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం–ఏపీసీఎన్ఎఫ్ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు నీతి ఆయోగ్ బృందం ఈ రోజు నుంచి రెండ్రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. నీతి ఆయోగ్ వ్యవసాయసభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ చందర్ నేతృత్వంలోని 8 మంది సభ్యులతో కూడిన బృందం రాష్ట్రంలోని ఏలూరు, కృష్ణ, గుంటూరు జిల్లాలలోని 7 గ్రామాల్లో పర్యటించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించనుందని అధికారులు తెలిపారు.

---------------------------

బియ్యం అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని పలు రైస్ మిల్లుల్లో మంత్రి నిన్న ఆకస్మిక తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిల్వ చేసిన బియ్యాన్ని జప్తు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాకినాడలో 52 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమ నిల్వలను జప్తు చేశామని, అందులో 25 వేల టన్నుల చౌకబియ్యం ఉందని, అక్రమ నిల్వలు, రవాణాకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

---------------------------

ఎన్డీయే కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమంతోపాటు విద్యార్థుల భవితకు ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్ర సచివాలయ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న నిర్వహించిన జ్యోతిబా, సావిత్రిబాయి పులే ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు వంటి ఇతర అంశాల్లోనూ రాణించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాష్ట్ర విద్యార్థులు ప్రాతినిధ్యం వహించేలా వారిని తీర్చిదిద్దాలని మంత్రి సూచించారు.

---------------------------

తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈరోజు మలయప్ప స్వామి వారు బద్రి నారాయణుడి అలంకారంలో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహన సేవలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సాయంత్రం చంద్రప్రభ వాహనసేవను నిర్వహిస్తారు.

---------------------------

తపాలా సేవల పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ రోజు జాతీయ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు. బ్రిటిష్ ఇండియా గవర్నర్ జనరల్ లార్డ్ డల్ హౌసీ 1854 సంవత్సరంలో స్థాపించిన భారతీయ తపాలా శాఖ ..... ఇంత కాలంగా పోషిస్తున్న పాత్రను స్మరించుకోవడం కోసం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భారత దేశంలో నగర ...., పట్టణ ...., గ్రామీణ ప్రాంతాలకు మాత్రమే కాకుండా మారు మూల ప్రాంతాలకు సైతం తపాలా శాఖ అందిస్తున్న సేవలు ఎంతైనా చిరస్మరణీయం. వినూత్న సేవలతో తపాలా శాఖ రోజు రోజుకీ

ప్రజలకు మరింత చేరువ అవుతోంది. బ్యాంకులతో సమానంగా ప్రస్తుతం ప్రజలకు తపాలా సేవలు అందుతుండడం ప్రశంసనీయం.

---------------------------

ప్రజలకు తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులను అందించేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలోని భీమవరంలో ఏర్పాటు చేసిన నిత్యావసర వస్తువుల ప్రత్యేక కేంద్రాన్ని కలెక్టర్ ఈరోజు ప్రారంభించారు. దీని పై మా ఆకాశవాణి పశ్చిమగోదావరి జిల్లా ప్రతినిధి ఐ.సుబ్బారావు అందిస్తున్న వివరాలను ఇప్పుడు విందాం.

వాయిస్ ( 34 సెకన్లు)

---------------------------

రాష్ట్రంలో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు పేరిట ఈ నెల 14 నుంచి 20 వరకు గ్రామాల్లో కొత్తగా చేపట్టే పనులను జనవరి నెలాఖరులోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎంవీఆర్ కృష్ణతేజ అధికారులను ఆదేశించారు. వారోత్సవాల్లో చేపట్టాల్సిన మార్గదర్శకాలను గ్రామీణాభివద్ధి శాఖ జారీ చేసింది. ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులు నిబంధనలకు అనుగుణంగా ఉండాలని, గ్రామ పంచాయతీ లేదా మండల, జిల్లా పరిషత్ ఆమోదం పొంది ఉండాలని సూచించారు. పనులు చేపట్టే ప్రాంతం జియో ట్యాగింగ్‌తో సహా అన్ని వివరాలను 'పీఆర్ వన్' మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

---------------------------

క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు ఈరోజు నుంచి వైయస్సార్ జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో గ్రామోదయం, పట్టణాల్లో నగరోదయం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. దీనిపై మా ఆకాశవాణి వైయస్సార్ జిల్లా ప్రతినిధి బి.శ్రీనాథ్ రెడ్డి మరిన్ని వివరాలను అందజేస్తారు.

వాయిస్ ( 34 సెకన్లు)

---------------------------

స్వచ్ఛ భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష కోరారు. శ్రీకాకుళం జిల్లా పలాసలో ఈ రోజు నిర్వహించిన స్వచ్ఛ శ్రీకాకుళం కార్యక్రమంలో ఆమె పాల్గొని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ కార్యక్రమంపై మా శ్రీకాకుళం జిల్లా ప్రతినిధి ఎస్.జోగినాయుడు మరిన్ని వివరాలను అందిస్తారు.

వాయిస్ ( 29 సెకన్లు)

=====================